## కథ

# శాంతి సౌజన్యం

**భారతుల ఫణిరాజ శర్మ**

**ఇంటికి రాగానే సోఫాలో ఆప సోపాలు పడుతూ చతికిలపడ్డాడు సౌజన్యారావు. ఫ్యాను ఫుల్ స్పీడుగా తిరుగుతున్నా సరే ముచ్చెమటలు ఆగకపోవడంతో మరింత చికాకుపడుతున్నాడు.**

**''శాంతా! కాఫీ తీసుకురా!'' భార్యామణికి ఆదేశాలు జారీ అయ్యాయి.**

''ఏంటో..ఈ రోజింత ఆలస్యం అయిందేమిటి?'' వేడి వేడి గ్లాసునందిస్తూ అడిగింది శాంతమ్మ. భర్త వాలకం కొంచెం తేడాగా ఉండడం గమనించింది. ప్రతిరోజూ సాయంత్రం నడక పూర్తి చేసుకున్న సౌజన్యారావు మహాత్ముడితో మాట్లాడిన స్వాతంత్ర్య సమరయోధుడిలా ఇంటికి చేరుకునేవాడు. కానీ ఈ రోజెందుకో కుంభకోణంలో చిక్కుకున్న కేబినెట్ మంత్రిలా చిటపటలాడుతున్నాడు.

ఆత్రంగా గ్లాసును నోటికి పట్టించిన సౌజన్యారావు ఆ ద్రవపదార్థం రుచి చూడగానే ముఖ కవళికలను అమాంతంగా మార్చేశాడు.

''ఇదేమిటే కాఫీ అడిగితే రాగిమాల్ట్ తీసుకొచ్చావ్! బుర్ర పన్జేయట్లేదా ఏమిటి?'' గద్దించాడు భార్యామణిని.

''అదంతే. నిన్న ఆ ఎత్తుపళ్ల డాక్టరేమన్నాడో గుర్తులేదా? కాఫీలూ టీలూ మూణ్నెళ్ల పాటు తాకడం కూడా తప్పని చెప్పలా! ఇలా రెండు, మూడు దఫాలు కాఫీలు తాగడం..రాత్రిళ్ళు నిద్ర పట్టక అవస్థపడడం ఎందుకొచ్చిన బాధ చెప్పండి. అందుకే ఈ ఏర్పాటు'' వివరించి చెప్పింది శాంతమ్మ.

తనకు రాగిమాల్ట్ ఇచ్చినందుకు కాదుగానీ, తన ఎదురుగానే శాంతమ్మ 'బ్రూ' తాగుతూ మాట్లాడడంతో రగిలిపోయాడు సౌజన్యారావు. ''పతిభక్తి మరీ ఎక్కువైనా బావోదే పంకజాక్షి!'' అన్నాడు దీనంగా.

''మీ ధర్మసంకటం మీకివ్వలేదనా..లేక నేను తాగుతున్నాననా..'' ముఖం మీదే అడిగి రుసరుసలాడుతూ వెళ్లిపోయింది శాంతమ్మ.

''అంటే అన్నానంటావు గానీ! నీకు నా ధ్యాస ఉందా అసలు? ఎందుకండీ చిరాకు..ఏంటి సమస్య అని మాటవరసకైనా అడిగావా?'' భార్య వెళ్లిన వైపు చూస్తూ గట్టిగా అరిచాడు.

''అడగడం..నీకెందుకవతలకి ఫో అని చీవాట్లు తినడం నాకేం కొత్త కాదుగా! మీ చిరాకు చింతచెట్టెక్కా మీరే వచ్చి చెప్పండి. కారణం బావుంటే విని ఓహో అంటాను. సరేనా'' వంట గది నుంచే 'సవివర'మైన సమాధానం అంతే స్పీడుగా వచ్చింది.

ఆలోచించి చూస్తే భార్య అన్న మాటలు సబబుగానే తోచాయి. ఎందుకనో కొంతకాలంగా మనసంతా అదోలా ఉంటోంది. ఏదో తెలియని అసంతృప్తి లోలోపలే తొలిచేస్తోంది. ప్రశాంతంగా కంటినిండా నిద్రపోయి కొన్ని నెలలవుతోంది. ఎంతమంది డాక్టర్లకు చూపించినప్పటికీ పర్సు పలచన...ఫలితం సున్నా అన్న చందంగానే ఉంటోంది. అనారోగ్యమూ కాదు..బాధ్యతలూ బాదరబందీలూ లేవు. అయినా ఏదో తెలియని కొరత. ఉదయమూ, సాయంత్రం కాసేపు వాకింగ్ చేయమని స్నేహితులు కొందరు సలహా ఇస్తే గత వారం రోజులుగా క్రమం తప్పకుండా నడవడం మొదలుపెట్టేడు. ఆలోచనల్లో మునిగిన సౌజన్యారావును నీరసం ఆవహించింది. భార్య ఎలాగూ తన వద్దకు రాదని తేలడంతో నుదుటి మీది చెమటను తుడుచుకుని తానే వంటగదిలోకి వచ్చాడు.

తాపీగా కూరగాయలు తరుగుతున్న శాంతమ్మకు ఎదురుగా వంట అరుగుపైకెక్కి కూర్చున్నాడు.

'ఏవిటి సంగతి?' అన్నట్టుగా చూసింది శాంతమ్మ.

''చెప్పేది వినవే చెంచులక్ష్మీ! ఇందాక వాకింగ్‌కి వెళ్లొస్తుంటే తిమ్మాపురం వెంకట్రాయుడు కన్పించాడే! పాపం అష్టకష్టాలు పడి పెంచుకున్న అరటితోట కాస్తా ఈమధ్య గాలివానకి పూర్తిగా నాశనమైపోయిందట. అందినంతవరకూ కాయా, కాండం అమ్ముకున్న తర్వాత కూడా మూడు లక్షల అప్పు మిగిలిందని కుమిలిపోయాడే!''

''అలాగా పాపం! ఎక్కడుంటున్నాట్ట?'' అడిగింది సానుభూతిగా.

''పోస్టల్ కాలనీలో వాళ్ల బంధువెవరో ఉన్నాడట. అక్కడే ఉండి ఏదైనా పని వెదుక్కుంటానన్నాడే! చూస్తే జాలేసింది శాంతా..మనిషి బొత్తిగా సగమైపోయాడు. మాటల్లో తన పరిస్థితి చెప్పిన తర్వాత నన్ను ఎంతో కొంత చేబదులడగాలనుకున్నాడనుకుంటా. పాపం అభిమానం అడ్డొచ్చి బాధతోపాటు ఆ మాటనూ మింగేశాడే...ఆగలేకపోయాడు. అడక్కుండానే వాడి చేతిలో ఎంతో కొంత పెడదామనిపించింది. నీతో చెప్పకుండా ఎందుకులే అని ఆగిపోయాను'' వాక్యం ముగించి చూసేసరికి ఎదురుగా శాంతమ్మ ముఖం వేడెక్కిన అట్లపెనంలా కన్పించింది సౌజన్యారావుకు. వెంకట్రాయుడి గురించి విని కరిగిపోతుందని ఊహించిన భార్యామణి పేరుకు విరుద్ధంగా ఎందుకు మారిపోయిందో అస్సలు అర్థం కాకపోవడంతో తట్టుకోలేక అడిగేశాడు.

''మొహం అలా మారిందేవిటే మోహనాంగీ?''

''మారదు మరీ! అక్కడికి మీకేదో దయార్ద్ర హృదయం పేటెంటు హక్కులాగా మేమంతా పాషాణ హృదయులంలాగా నన్నమాట!'' అంది కోపంగా.

''అలా విసుక్కోకే అష్టలక్ష్మీ...అసలు వెంకట్రాయుడెలాంటి మనిషి? ప్రతి సంక్రాంతికీ కోతలు పూర్తికాగానే ఊరందరికీ ఎలా విందు సంతర్పణ చేసేవాడు! పక్కవాళ్లు కరివేపాకు తెచ్చినా ఒప్పుకునే వాడు కాదు. మొత్తం తన ఖర్చేనని ఆప్యాయత చూపేవాడు కదూ! అలాంటివాడికి ఇంద..వంద ఇదిగో వెయ్యి అనడం కన్నా ఏదైనా దారిచూపితే మేలనిపించిందే. అందుకే తటపటాయించాను'' భార్యవైపు చూశాడు.

''మీరన్నదీ నిజమే. అయినా సరే. అక్కడే కొంత సాయం చేసుంటే బాగుండేదేమో!''

''అబ్బా..పూర్తిగా వినవే పుణ్యవతీ! అలా వెంకట్రాయుడితో మాట్లాడుతున్నప్పుడే వీధి చివర స్పీడ్‌పోస్ట్ కన్పించాడు''

''ఎవరూ! రంగారావా?'' అడిగింది శాంతమ్మ మధ్యలో కల్పించుకుని.

''ఆ..వాడే! వాడూ వాడి పరుగులూనూ..వాడి నడకకు మేం పెట్టుకున్న ముద్దు పేరది. పిలిచి మరీ చెప్పాడు. వాళ్ల చివరమ్మాయి శ్రీవల్లికి నూజివీడు సంబంధం కుదిరేలా ఉందిట. వియ్యపురాలి బంధువులెవరో అమెరికాకు వెళ్లిపోవాలిట. అందుకని ఈ నెల్లోనే




వ౦౦హా
ర్తాలు చూస్తున్నానన్జెప్పాడు. ఎంతైనా ఆడపిల్ల పెళ్లంటే హడావిడేగా! అవసరానికేదైనా సర్దగలవా అన్నట్లుగా ఇండైరెక్టుగా అడిగాడే!''

''పాపం... అసలే వె(రిబాగులవాడు. పైగా ఆడ పిల్ల పెళ్లి పెట్టుకున్నారు. అలాంటి వాళ్లకు సహాయం చేస్తే కన్యాదాన ఫలంలో కాస్తైనా మనకూ దక్కుతుంది.''


పెళ్లి మాట వినగానే సంబరపడింది శాంతమ్మ వెంక(టాయుణ్ని వెయిటింగ్ లిస్ట్‌లోకి పంపిస్తూ.

''అంత త్వరగా నిర్ణయం తీసుకోకే అంబు జాక్షీ! మరో విషయం కూడా ఉంది. అదీ విన్న తర్వాత అప్పుడు చెప్పు నీ అభి(ప్రాయం'' అని మెలికపెట్టాడు సౌజన్యారావు.

''ఓరి భగవంతుడా! బయటికెళ్లిన తర్వాత ఒక పెత్తనమా మీది? వాకింగ్ చేసి రండి స్వామీ అని పంపిస్తే..అందరి ఇళ్ల సంగతులూ వాకబు చేసుకొస్తున్నారు. ఊళ్లో వాళ్లందరూ వారి విష యాలన్నీ మీ ముందే పూస గుచ్చుతున్నారు కాబోలు. సరే! ఆ మూడో ముచ్చట కూడా వివ రించండి'' అంది స్టౌ కట్టేస్తూ.

భార్య వంటపని కూడా పూర్తికావడంతో సవి వరంగా చెప్పడం మొదలుపెట్టాడు సౌజన్యారావు.

పార్కు రోడ్డు సవితా హోటల్ శంకర్ రెడ్డి భార్యకి గుండెజబ్బొచ్చిం దట. అర్జంటుగా ఆపరేషన్ చేసి గుండెలో ఏదో వాల్వ్యు మార్చా లిట. ఖర్చు ఎంతలేదన్నా మూణ్నాలుగు లకారాలు దాటు తుందని డాక్టర్లు చెప్పారట. దాంతో గత్యంతరం లేక హోట ల్‌ను, స్థలాన్ని రియల్ ఎస్టేట్ రామారావుకి అమ్మేశాడు. పాపం అక్కడ పనిచేసే సర్దారప్ప, వినోదు, సు(బమణ్యం అందరూ కలిపి మొత్తం ఐదారుగురు కు(రాళ్లు. పాపం రోడ్డున పడ్డారే! నేనెప్పుడెళ్ళినా సరే నిమిషంలో (స్ట్రాంగ్ కాఫీ కలుపుకునొచ్చేవాడు సర్దారప్ప. ఇందాక కనబడి టీ తాగడానికి రెం(డూపాయలిమ్మని అడుగుతుంటే కడుపుతరుక్కు పోయిందే శాంతం! ఈ నెల పాలసీ డబ్బు చేతికొస్తుందిగా! మనకెలాగూ ఖర్చులేవీ లేవు. ఉన్న



ముగ్గురు పిల్లలూ రాజకీయ, వాణిజ్య, సాంస్కృతిక రాజధానుల్లో స్థిరపడిపోయారు. ఆ డబ్బుతో వీళ్లకేదైనా చేస్తే బాగుంటుందే..''

ఆలోచనగా నిట్టూర్చింది శాంతమ్మ.

''పెళ్లి హాల్లో కూర్చోండి. ఇక్కడి పని ముగించుకొస్తాన్నేను'' అంది భర్తతో.

ఆనందించాడు సౌజన్యారావు. ఎందుకంటే ఏదైనా దీర్ఘాలోచన తర్వాత మంచి ఉపాయం, సలహా ఇవ్వాల్సినప్పుడే తనను హాల్లో కూర్చోమనడం భార్యకి అలవాటు. తన సొంత అభిప్రాయాలు ఎన్ని ఉన్నప్పటికీ హోమ్మినిస్టర్‌ను సంప్రదించడం తనకు ఎప్పుడూ మేలు చేస్తుందనేది సౌజన్యారావు నమ్మకం, అనుభవ పూర్వకం కూడానూ!

''ఆ చేత్తోనే కాఫీ తీసుకు రావే కరణేషు మంత్రీ!'' మరోసారి అర్జీ పెట్టుకుని హాల్లోకొచ్చేశాడు.

వంటింట్లో తన పన్లన్నీ చక్కబెట్టుకుని ఒక అరగంట తర్వాత హాల్లోకి వచ్చింది శాంతమ్మ. పరీక్ష హాలులో క్వశ్చన్ పేపర్ అందుకోబోతున్న ఇంటిలిజెంట్ స్టూడెంట్‌లా ఆత్రంగా ఎదురు చూస్తున్న అరవైయేళ్ల భర్తను చూసి నవ్వొచ్చింది. నవ్వుకుంటూనే సౌజన్యారావుకు ఎదురుగా వచ్చి కూర్చుంది శాంతమ్మ. మళ్లీ ఖాళీ చేత్తో వచ్చిన భార్యను చూసి హతాశుడయ్యాడు సౌజన్యారావు.

''ఇదేంటే. ఇందువదనా! ఖాళీ చేత్తో వచ్చావ్..కాఫీ కప్పెక్కడ?''

''ఎలాగూ భోజనాల వేళ కావొస్తోంది కదండి. ఇప్పుడు కాఫీ ఎందుకని తీసుకురాలేదు'' అంది అనునయంగా.

''అనుకున్నాను. నువ్వు ఇదే మాట చెబుతావని..అద్సరే. వాళ్లందరి సంగతి ఏం చేద్దాం? ఇంతసేపు ఆలోచించావుగా సలహా చెప్పు''

''అక్కడికే వస్తున్నా! మీరేమో ఎంచక్కా ఊరంతా తిరిగి ముగ్గురి సమస్యలను ఇంటికి తెచ్చారు. అందరూ ఆప్తులే. అందరికీ మనం శ్రేయోభిలాషులమే. ఒకరికి సహాయం చేసి మరొకరిని వదిలేయలేం. అలాగని అందరినీ కష్టాలనుంచి గట్టెక్కించడం ఆర్థికంగా మనక్కూడా సాధ్యం కాదు కదా!'' భర్తకు వివరించింది.

''సరే..ఈ ముగ్గురి లో ఎవరి సమస్య తీర్చాలని నీ ఉద్దేశ్యం'' అడిగాడు ఆత్రంగా.

''అలా ఎందుకు ఆలోచిస్తారు? అందరికీ మంచి జరిగేలా ఏదైనా ఒక ఉపాయం ఉంటుందని ఎందుకు ప్రయత్నించకూడదు?'' చురకవేసింది.

''కొంచెం అర్థమయ్యేలా చెప్పవే కోమల వల్లీ!'' బుర్రగోక్కుంటూ దగ్గరికి జరిగాడు సౌజన్యారావు.

''మరేమీ లేదండీ. ఈ నెల వచ్చే పాలసీ డబ్బు, నెల నెలా నేను 'పొదుపు డబ్బాల' పొదుపు సంస్థలో దాచుంచిన మొత్తం అంతా కలిపి ఓ యాభై అరవై వేలు సమకూరొచ్చు. మీరు రంగారావుకి ముహూర్తాలు పెట్టించమని చెప్పండి. పెళ్లి భోజనాల విషయం పూర్తిగా మనమే నెత్తిన వేసుకుందాం! వాళ్ల కుటుంబాల్లో పెళ్లి భోజనాల ఖర్చు కూడా యాభై అరవై వేలకి మించదని నా అభిప్రాయం. మిగతా ఖర్చులకి తానే ఏదో ఏర్పాటు చేసుకుంటాడు. దాంతో అందరి సమస్యలూ తీరిపోతాయి'' చెప్పింది క్లుప్తంగా.

''అందరి సమస్యలు ఎలా తీరతాయే అంబుజాక్షీ?'' అయోమయంతో అడిగాడు సౌజన్యారావు.

''ఎందుకు తీరవు? మనం డబ్బుని నేరుగా రంగారావుకి ఇవ్వట్లేదు. పెళ్లి భోజనాల ఏర్పాటు ఎలాగూ మనమే చూస్తున్నాం కాబట్టి దాని కాంట్రాక్టును వెంకట్రాయుడికి ఇద్దాం. ఐ మీన్..వెంకట్రాయుడు ఆ పెళ్లికి కేటరింగ్ కాంట్రాక్టర్ అన్నమాట. దాన్నతడు మా బాగా మెయింటెయిన్ చేసుకోగలడు. అందులోనే ఆ హోటల్ కుర్రాళ్లకి పని ఇప్పిద్దాం. ఇది నాకు తోచిన తరుణోపాయం. మీరేమంటారు?'' అడిగింది భర్తని.

''బాగానే ఉందనుకో! ఈ ప్రయత్నం నిజంగానే వాళ్లను సమస్యల నుంచి గట్టెక్కిస్తుందంటావా?'' అడిగాడు అర్థోక్తిగా.

''ఖచ్చితంగా! ఎందుకంటే విందు భోజనాల ఎరేంజ్‌మెంటులో మన వెంకట్రాయుడు ఎంత జాగ్రత్త తీసుకుంటాడో, రుచుల విషయంలో ఎంత ఖచ్చితంగా ఉంటాడో మీకూ తెలుసుగా! పెళ్లిళ్లలో వంటలు బాగుంటే పాపులారిటీ వద్దన్నా సరే వెంటబడుతుంది. పైగా ఇది ముహూర్తాల సీజన్. మంచి పేరొచ్చిందంటే ఆర్డర్లు ఇట్టే చేతికి వస్తాయి. దేవుడి దయతో అన్నీ సవ్యంగా జరిగే



శ్రావణమాసం పూర్తయ్యేలోగా వెంకట్రాయుడి అప్పు సగానికి పైగా తీరిపోతుంది. పైగా ఈ వ్యాపారంవల్ల ఆ కుర్రాళ్లకి కూడా పనిదొరికే అవకాశం ఉంది'' చెప్పింది చాకచక్యంగా.

సౌజన్యారావుకి ఈ ఉపాయం బాగా నచ్చింది. ఇదే విషయాన్ని మరుసటి రోజే వెంకట్రాయుడితో చర్చించాడు. వెంకట్రాయుడికి కూడా ఈ వ్యాపారం బాగా అనుకూలమైనదిగా తోచింది.

రంగారావు కూతురి పెళ్లికి అదే నెలలో ముహూర్తం కుదిరింది. వెంటనే వెంకట్రాయుడి చేతిలో అరవై వేలు పెట్టి పెళ్లి భోజనాల ఏర్పాట్లు పురమాయించాడు సౌజన్యారావు.

వెంకట్రాయుడు ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకున్నాడు. సొంత కుటుంబంలో పెళ్లిలాగా శ్రద్ధతో రాయుడు చేయించిన వంటకాలు అందరి మెప్పు పొందాయి. శాంతమ్మ ఊహించిన దానికన్నా ఎక్కువగానే వెంకట్రాయుడు పేరు తెచ్చుకున్నాడు. కొందరు పెద్దమనుషులు ఏజెన్సీ పేరేంటి, అడ్రస్సెక్కడ అంటూ రంగారావును అడిగారు. వాళ్లంతా వెంకట్రాయుడికి కాంట్రాక్టు ఇవ్వాలనుకున్నవాళ్లే. రంగారావు వెంకట్రాయుడికి ఈ సంగతి చెప్పి ఒక ఆఫీసు లాంటిది ప్రారంభించమని సలహా ఇచ్చాడు. వెంకట్రాయుడికి కూడా అది అవసరమేనన్పించింది.

మరుసటి సాయంత్రమే సంజీవనగర్ కళ్యాణ మండపం పక్కనే ఒక డాబా గదిలో కేటరింగ్ సర్వీసును ప్రారంభిస్తున్నానని ఆహ్వాన పత్రికలు పంచాడు రాయుడు.

సతీసమేతంగా హాజరైన సౌజన్యారావుకు బయటి బోర్డు చూడగానే అమితాశ్చర్యం కలిగింది. 'శాంతి సౌజన్య కేటరింగ్ సర్వీస్'కు ప్రారంభించిన రోజే మూడు కాంట్రాక్టులు లభించాయి. ''శాంతా! ఇలారా'' అని భార్యను పిలిచాడు సౌజన్యారావు.

భర్త తనను యతి ప్రాసలు లేకుండా ఒట్టి పేరుతో పిలవడం శాంతమ్మకు వింతగా తోచింది.

దగ్గరికొచ్చిన భార్య భుజంపై తట్టి అభినందించాడు సౌజన్యారావు. ఆ స్పర్శలో కృతజ్ఞత, సంతృప్తి, అభినందన అన్నీ ఉన్నాయి.

మామూలుకన్నా ఒక ముద్ద తక్కువే తిన్నప్పటికీ ఆనందంతో సౌజన్యారావు కడుపు నిండిపోయింది. భార్యను మళ్లీ కాఫీ అడగడం లేదు. ఇంటికి వచ్చీ రాగానే ఆదమరచి నిద్రిస్తున్న భర్తను చూశాక శాంతమ్మకు ఆశ్చర్యం, ఆనందం రెండూ ఒకేసారి కలిగాయి.